
క్లుప్తంగా

అయ్యప్పస్వామికి వేడుకగా పూజలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అభిషేకాలు, హోమాలు తదితరాలను శనివారం జరిపారు. ఉభయకర్తలుగా బండారు మధుసూదన్‌రెడ్డి, రజనీ సరస్వతి, అల్లంపాటి పెంచలరెడ్డి, విజయమ్మ, రంగయ్యనాయుడు, సుదర్శనమ్మ వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్‌సీసీ దినోత్సవం



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ గిరి, కళాశాల ఆర్మీ విభాగ కెప్టెన్ కళాప్రియ, కేర్ టేకర్ దివ్య, క్యాడెట్లు ప్రీతిక, సనా, కౌసర్, శ్రేయ, విష్ణుప్రియ, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

యువోత్సవ్‌ను విజయవంతం చేయాలి

నెల్లూరు రూరల్: యువోత్సవ్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా అధికారులతో వర్చువల్ సమావేశాన్ని శనివారం ఆయన నిర్వహించారు. వివిధ అంశాలపై స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే నెహ్రూ యువ కేంద్రం, జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డిని సంప్రదించాలని కోరారు.

జీఓ నంబర్ 73 మేరకు కూలి ఇవ్వాలి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యవసాయ కూలీల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 73 మేరకు ఆరు గంటల పనికి రూ.480 కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులకు పనులు దొరకడంలేదని.. బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి బడ్జెట్లలో కోత విధించడం దారుణమని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు, ఉపాధ్యక్షులు పెద్దబ్బయ్య, రాధయ్య, నాగమ్మ, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమీ హుస్సేనీకి అభినందన

నెల్లూరు(బృందావనం): అమెరికా గ్లోబల్ పీస్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను పొందిన సమీ హుస్సేనీని పలువురు సత్కరించారు. వహబ్‌పేటలోని పరివార్ ఫంక్షన్ హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రియాజ్, హంజా హుస్సేనీ, అలీం, జియాఉల్ హక్, షంషుద్దీన్, హఫీజ్, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు



నెల్లూరు రూరల్: అభివృద్ధిని కాంక్షించే బీజేపీకి మహారాష్ట్ర ప్రజలు పట్టం కట్టారని పార్టీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్ కార్యాలయంలో మిఠాయిలను శనివారం పంపిణీ చేశారు. పూనమల్లి రామకృష్ణ, న్యాయవాదులు సునీల్, నాగేంద్ర, చిలకా ప్రదీప్, రాము తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని బీజేపీ కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యరబోలు రాజేష్, గడ్డం విజయ్‌కుమార్, కరణం సుభాషిణి, గిరికుమార్‌గౌడ్, మదన్, సుబ్బారావు, రఘురామయ్య, ముని సురేష్, పిడుగు లోకేష్, కుప్పా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన పాలన

- నగరపాలక సంస్థలో ప్రక్షాళనేదీ..?
- సమయపాలన పాటించని సిబ్బంది
- టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, పారిశుధ్య విభాగాలపై పలు ఆరోపణలు
- అర్జీలిస్తేగానీ స్పందించని అధికారులు
- పురపాలక శాఖ మంత్రి ఇలాకాలో ఇదీ పరిస్థితి



నగరపాలక సంస్థ కార్యాలయం

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో పాలన గాడితప్పింది. అడిగే వారు లేకపోవడంతో ఎవరికి వారే యమునా తీరే అనే చందంగా కొందరు వ్యవహరిస్తుండగా, మరికొందరు సమయపాలనను పాటించడంలేదు. కార్యాలయంలోని పలు విభాగాల్లో కొంత మంది ఉద్యోగులు ఏళ్లుగా అక్కడే పాతుకుపోయారు. ఈ పరిణామాల క్రమంలో కార్యాలయంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నగరంలోనే ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం.

ఇదీ తీరు..

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో 1,83,643 గృహాలున్నాయి. దాదాపు ఎనిమిది లక్షల మంది నివసిస్తున్నారు. నగర ప్రజలకు మౌలిక వసతులు, పౌరసేవలు, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేలా కార్పొరేషన్ చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే అస్తవ్యస్తంగా మారిన పాలనతో ఈ పరిస్థితే కనిపించడంలేదు

వేలాది మంది ఉద్యోగులు

నగరపాలక సంస్థలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, ఆరోగ్య, రెవెన్యూ, ఎస్టాబ్లిష్‌మెంట్ తదితర విభాగాలున్నాయి. ఆయా విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులు ఉన్నారు. అయితే వీరిలో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సమయపాలన పాటించకుండా నిర్లక్ష్య ధోరణిని కనబరుస్తున్నారు.

అవసరానికి మించి..

నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఒక్కో విభాగంలో ఉండాల్సిన సిబ్బంది కంటే అధికంగా ఉన్నారు. తమ సమస్యలను తెలియజేయాలనే ఉద్దేశంతో కార్యాలయానికి ప్రజలు వచ్చిన సమయాల్లో వారికి సమాధానం చెప్పేవారే కరువయ్యారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రమిస్తే గానీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు అకౌంట్స్ విభాగంలో కొందరు సీనియర్ సహాయకులు మూడేళ్లకుపైగా కొనసాగుతూనే ఉన్నారు.

సీసీలుగా ఇప్పటికీ వారే..!

కమిషనర్లు ఎంత మంది మారినా సీసీలుగా ఉన్న ఉద్యోగులే నేటికీ కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఇద్దరిలో ఒకరు జూనియర్ అసిస్టెంట్ కాగా, మరొకరు బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే వీరు సీసీలుగా నాలుగేళ్లుగా అదే విధుల్లో కొనసాగుతున్నారు. వీరికున్న పలుకుబడితో ఎవరూ మార్చలేని పరిస్థితి ఏర్పడింది. కమిషనర్‌కు తెలియకుండా ఆయన పేరు చెప్పి ఓ వైపు కార్యాలయ ఉద్యోగులు.. మరోవైపు కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

ప్రక్షాళన చేసి పరిష్కరించేనా..?

మంత్రి నారాయణతో పాటు కమిషనర్ సూర్యతేజ ప్రత్యేక దృష్టి సారించి నగరపాలక సంస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్యలను పరిష్కరించి పరిపాలన సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలో బదిలీలు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగంలో ఏళ్లుగా తిష్టవేసిన అధికారులు, ఇన్‌స్పెక్టర్లను ఎట్టకేలకు బదిలీ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి వరకు కసరత్తు చేసి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులను కమిషనర్ సూర్యతేజ జారీ చేశారు.

• పన్నుల వసూళ్లకు సంబంధించి ముగ్గురు రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు విధులు నిర్వర్తించారు. వీరి స్థానంలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇనాయతుల్లాకు ఆర్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సమద్, రాజేశ్వరిని హెల్త్ సెక్షన్ శానిటరీ సూపర్‌వైజర్లుగా.. శ్రీనివాసులును రెవెన్యూ విభాగ సూపరింటెండెంట్‌గా నియమించారు.

• రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా విధులు నిర్వర్తిస్తున్న పది మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఆర్‌ఐ, సూపరింటెండెంట్ ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న పద్మావతిని ఇంజినీరింగ్ విభాగ రెగ్యులర్ సూపరింటెండెంట్‌గా నియమించారు. కృష్ణంరాజు, కృపాకర్‌రావు, చిన్నబాబును హెల్త్ సెక్షన్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్‌కుమార్‌ను ఇంజినీరింగ్ సెక్షన్ ఈ – 2 క్లర్క్‌గా, కృష్ణకిశోర్‌ను రెవెన్యూ సెక్షన్లోని ఏ – 1 క్లర్క్‌గా, రవిని హెచ్ – 3, హెచ్ – 5 ఇన్‌చార్జిగా, అజయ్‌ను టౌన్‌ప్లానింగ్ విభాగ జీ – 1 క్లర్క్‌గా, శ్రీనివాసులును టౌన్‌ప్లానింగ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా, పెంచలయ్యను వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా బదిలీ చేశారు.

• ఆర్‌ఐల స్థానాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న వంశీనాథ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, సందీప్, శరత్‌బాబు, శ్రావణ్‌కుమార్, లోకనాథాన్ని నియమించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



ఇన్‌స్పెక్టర్ రోశయ్యకు సత్కారం

నెల్లూరు (టౌన్): చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండి, మంచిగా చదువుకొని అభివృద్ధిలోకి రావాలని ఇన్‌స్పెక్టర్ రోశయ్య పేర్కొన్నారు. దర్గామిట్టలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు గురుమూర్తి, సుజాత, శివలక్ష్మి, రఘురామయ్య, బషీర్, జయలక్ష్మి, దీప్తి, లక్ష్మి, హరిబాబు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు విద్యుత్ సంస్థల ధారాదత్తం



మాట్లాడుతున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ రంగాన్ని కార్పొరేట్‌కు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. బాలాజీనగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తోందని చెప్పారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.17 వేల కోట్ల భారాన్ని మోపిందని ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీల భారాన్ని అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరిని వీడి ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, నరసింహ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబరాలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): కేరళలోని వయనాడ్‌లో ప్రియాంక గాంధీ.. జార్ఖండ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నగరంలోని ఇందిరాభవన్‌లో ఆ పార్టీ నేతలు సంబరాలను శనివారం జరుపుకొన్నారు. డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్, నేతలు సంజయ్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, అల్లావుద్దీన్, గణేష్, మల్లికార్జునరెడ్డి, హుస్సేన్‌బాషా, రాజేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల సమస్యలు పరిష్కరించాలి



మెప్మా పీడీకి వినతిపత్రమిస్తున్న ఐద్వా నేతలు

నెల్లూరు(బారకాసు): పొదుపు మహిళలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించాలని ఐద్వా జిల్లా, నగర కార్యదర్శులు మస్తాన్‌బీ, కత్తి పద్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని మెప్మా కార్యాలయంలో పీడీ రాధమ్మకు వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. వడ్డీ, రుణ మాఫీని సక్రమంగా అమలు చేయాలని కోరారు. బ్యాంక్ లింకేజీ రుణాల విషయంలో ఇన్సురెన్స్‌ను బలవంతంగా వసూలు చేస్తున్నారని, పొదుపు మహిళలపై అధికారుల దురుసు ప్రవర్తనను అరికట్టాలని చెప్పారు. మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు స్థానిక యూనిట్లను ప్రారంభించాలన్నారు. నగరంలోని 53, 54వ డివిజన్లలో ప్రభుత్వ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

యువతను కాపాడాలని వినతి

నెల్లూరు(క్రైమ్): న్యూడ్ వీడియో కాల్స్, ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా పెడదోవ పడుతున్న యువతను కాపాడాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్ కోరారు. ఈ మేరకు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రాన్ని శనివారం ఆయన అందజేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో బాలల దినోత్సవాన్ని నేతాజీ ఎమ్మెస్సార్ పైలట్ హైస్కూల్ చైర్మన్ నేతాజీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ ఏడాదిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. 595 మార్కులు సాధించిన సాయికిరణ్‌కు రూ.50 వేల ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. గూడూరుకు చెందిన దివ్యాంగ గాయకులు ఆలపించిన పాటలు అలరించాయి. అనంతరం ముఖ్యఅతిథులను సత్కరించారు. అపస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నేలనూతల శ్రీధర్, గౌరవాధ్యక్షుడు రవీంద్రరెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి కృష్ణారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ 2022 ట్రెజరర్ నలుబోలు బలరామయ్యనాయుడు, అపస్మా నగరాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి రమేష్‌బాబు, డైరెక్టర్ సుబ్రామ్, డైరెక్టర్ అలేఖ్యరెడ్డి, ప్రిన్సిపల్ సుధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక



నెల్లూరు (పొగతోట): నెల్లూరు జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నగరంలో శనివారం నిర్వహించిన సమాఖ్య సమావేశంలో సభ్యులను ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షురాలిగా లీలావతి (బోగోలు), కార్యదర్శిగా మాధురి (దుత్తలూరు), కోశాధికారిగా రమాదేవి (కలువాయి), ఉపాధ్యక్షురాలిగా మయూరికుమారి (వెంకటాచలం), సంయుక్త కార్యదర్శిగా పుష్పలత (కొడవలూరు) ఎన్నికయ్యారు. అనంతరం ఈసీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): మినీబైపాస్‌లోని మహేశ్వరి, పరమేశ్వరి కల్యాణ మండపంలో కళా సంస్కృతి చేనేత, హస్తకళా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శన ఆకట్టుకుంటోందని నిర్వాహకుడు లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడారు. గద్వాల్, చీరాల, పోచంపల్లి, మంగళగిరి, వరంగల్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన కాటన్, శిల్క్, జరీ, కలంకారీ చీరలు, బెడ్‌షీట్లు, ప్యాచ్‌వర్క్ బెడ్‌షీట్లు తదితరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు. రోజూ ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



సత్యసాయి మందిరంలో..



వర్ధమాన సమాజ హాల్లో..

నెల్లూరు(బారకాసు): గోమతినగర్‌లోని సత్యసాయి మందిరంలో సత్యసాయి జయంతి వేడుకలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తొలుత స్వామివారి చిత్రపటాలను వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సాయిగాయత్రి రుద్రహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊంజల్‌సేవను భక్తిశ్రద్ధలతో జరిపారు. కీర్తనలను చిన్నారులు ఆలపించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రసాదాలను పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించారు. మహా మంగళహారతితో వేడుకలను ముగించారు. మందిర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ, సమితి కన్వీనర్ కొండా శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సత్యసాయిబాబా జయంతిని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం ఉచ్చి రాజశేఖర్, మాగుంట వెంకటరంగారెడ్డి, శ్రీమంతుల హరనాథ్, పేట రాఘవయ్య, మాధవిని సత్యసాయి సేవా పురస్కారాలతో సత్కరించారు. బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేరూరి ప్రదీప్, యోగి రామ తపోవన ఆశ్రమ కార్యదర్శి కృష్ణారెడ్డి, అందె శ్రీనివాసులు, మురళీమోహన్‌రాజు, శ్రీరామరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, నాట్యగురు జ్యోత్స్న, సుధాకర్, బుజ్జయ్య, దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం



చిన్నారులతో అతిథులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈశా ఫౌండేషన్ క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. అనంతరం వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన



నెల్లూరు సిటీ: బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలపై అవగాహన సదస్సును సౌత్‌రాజుపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడారు. బాలికలను ఉన్నతంగా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమణయ్య, ఏఎస్‌ఎం ప్రసన్న, పద్మప్రియ, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి



డీఎంహెచ్‌ఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): పడారుపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ మరణించిన గండికోట సురేంద్రబాబు కుటుంబాన్ని ఆదుకోవాలని హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు సంతపేటలోని వైద్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యకు వినతిపత్రాన్ని శనివారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సురేంద్రబాబు భార్యకు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగం కల్పించాలని కోరారు. నేతలు మజురుల్లా, మురళి, నాగరాజు, సాయికార్తీక్, తిరుపతయ్య, కల్యాణ్, ఉషా, ఆల్ఫ్రెడ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శివపంచాక్షరి సప్తాహం ప్రారంభం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో శివపంచాక్షరి సప్తాహం, అఖండ భజనలను భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదు భక్తబృందాల ఆధ్వర్యంలో శివపంచాక్షరి సప్తాహం, అఖండ భజనలను ఈ నెల 30 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. తొలుత భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరుడు, తాత్కాలికంగా ప్రతిష్ఠించిన పరమేశ్వర రూపాలకు అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, భక్త బృంద నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డి, మేకల నరేంద్ర, రాజారెడ్డి, రత్నయ్య, నరేంద్రబాబు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.